క్లుప్తంగా

మీసేవా కేంద్రానికి దరఖాస్తుల ఆహ్వానం

నడిగూడెం : మండలంలోని సిరిపురంలో మీసేవా కేంద్రం నిర్వహణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీఎం రామలక్ష్మి బుధవారం విలేకరులకు తెలిపారు. స్వయం సహాయక సంఘంలో సభ్యురాలై ఉండి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, కంప్యూటర్‌లో పీజీడీసీఏ చదివి, 18- 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు ఆరు దరఖాస్తులు వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు.

సాగర్ ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద మరమ్మతులు



ఎడమకాలువ అడుగుల లెవల్ అంకెలను రాస్తున్న సిబ్బంది

మునగాల : నాగార్జునసాగర్ ఎడమ కాలువకు ప్రభుత్వం ఆగస్టు 2వ తేదీన సాగు నీటిని విడుదల చేయాలని నిర్ణయించడంతో మునగాల శివారులో సాగర్ ఎడమకాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద బుధవారం నుంచి సిబ్బంది మరమ్మతు పనులను ముమ్మరం చేశారు. హెడ్ రెగ్యులేటర్ తలుపులకు గ్రీజింగ్, విద్యుత్ పనులతో పాటు ఎడమకాలువ నీటిమట్టం కొలిచే అడుగుల పట్టిక పనులను ఏఈ సత్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు జానీ, వెంకటనారాయణలు చేయిస్తున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత




కలకోవలో లక్ష్మయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మిత్రులు

మునగాల : మండలంలోని కలకోవలో కొమ్రాజు లక్ష్మయ్య ఇటీవల బోరు బావిలో పడి మృతి చెందారు. 1991- 92 విద్యా సంవత్సరంలో ఆయనతో పాటు కలిసి పదవ తరగతి చదివిన స్నేహితులు లక్ష్మయ్య మరణవార్త తెలుసుకొని బుధవారం లక్ష్మయ్య కుటుంబానికి రూ.16,500ల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భవిష్యత్‌లో లక్ష్మయ్య కుటుంబానికి అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

మునగాల : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మునగాల ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. రాత్రి సమయాల్లో రోడ్లపై హల్‌చల్ చేస్తే చర్యలు తప్పవన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదని అన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయవద్దని, మద్యం సేవించి వాహనాలు నడవపద్దని సూచించారు. పోలీసు నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని అన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రాంబాబుగౌడ్

చిలుకూరు : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని ఎస్‌ఐ సురభి రాంబాబుగౌడ్ అన్నారు. బుధవారం చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే ఓటీపీలను ఇతరులకు చెప్పవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు, కందిబండ వెంకటేశ్వర్లు, పోలీసులు శ్రీకాంత్, నగేష్, ఎమ్.వెంకటేశ్వర్లు, షేక్ ఖజా తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

మోతె : ఉద్యోగులు అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు లభిస్తుందని మాజీ జెడ్పీటీసీ పుల్లారావు అన్నారు. బుధవారం మోతె మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బదిలీపై వెళ్తున్న ఉద్యోగుల సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన మండల అభివృద్ధి అధికారి హరిసింగ్‌నాయక్, సూపరింటెండెంట్ వెంకటాచారి, జూనియర్ అసిస్టెంట్ శోభ, కార్యదర్శులు కల్పన, కవిత, రేణుక, స్వప్న, రామకోటిలకు పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్మికులు, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంఘమిత్ర, ఏఓ అరుణ, ఏపీఓ నగేష్, ఏఈ మణికంఠ, సామచిన వెంకటరెడ్డి, నర్సింహారావు పాల్గొన్నారు.

ఆశలు రేకెత్తిస్తున్న చెక్‌డ్యాం

- పాలేరు వాగుపై కృష్ణాపురం చెక్‌డ్యామ్‌లో కరవులోనూ నిండా నీరు
- అక్కడ ఎత్తిపోతల పథకం నిర్మిస్తే పది గ్రామాలకు సాగునీరు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టి సారించాలని రైతన్నల వేడుకోలు



కృష్ణాపురం చెక్ డ్యాం

కోదాడ : అవి సాగర్ ఆయకట్టు గ్రామాలైనప్పటికీ ఏనాడు సాగునీరు సక్రమంగా అందింది లేదు. పక్కనే జీవనదిలా పాలేరు వాగు ఉన్నా ఆ నీటిని ఉపయోగించుకునే అవకాశమూ రాలేదు. కానీ ఇటీవల ఆ ప్రాంతంలో నిర్మించిన ఓ చెక్ డ్యాం మాత్రం ప్రస్తుతం రైతుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. సాగర్ ఆయకట్టులో చివరన ఉన్న పది గ్రామాల ప్రజలు రెండు సీజన్‌లలో పంటలు పండించుకోవడానికి ఆ చెక్ డ్యాం అవకాశంగా మారింది. ఈ విషయంలో ప్రభుత్వంతో పాటు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టి సారిస్తే పది గ్రామాలకు సాగునీరు అంది సస్యశ్యామలం అవుతాయని అన్నదాతలు వేడుకుంటున్నారు.

ఆయకట్టు ఎక్కువగా ఉండడంతో..

సాగర్ ఆయకట్టు పరిధిలోని కొత్తగూడెం మేజర్ కాల్వ కింద చివరి భూములకు సాగునీరు సక్రమంగా అందడం లేదు. కాలువ పరిధి ఎక్కువగా ఉండడం, కాలువ శిథిలావస్థలో ఉండడంతో పాటు ఆయకట్టు ఎక్కువగా ఉండడంతో అనంతగిరి, కోదాడ మండలాల పరిధిలోని పది గ్రామాల్లో సాగుకు నీరు అందడం లేదు. దీంతో సాగునీటి కోసం రైతులు నిత్యం పోరాటం చేయాల్సి వస్తోంది. ఈ గ్రామాలను ఆనుకొని పాలేరు వాగు జీవనదిలా పారుతున్నా ఆ నీటిని ఉపయోగించుకొనే అవకాశం లేదు.

సాగర్ నీరు రాకపోయినా..

అనంతగిరి మండలం కృష్ణాపురం- ఖమ్మం జిల్లా సుద్దేపల్లి మధ్య పాలేరు వాగుపై నాలుగు సంవత్సరాల క్రితం రూ.33 కోట్లతో బ్రిడ్జి కమ్ చెక్‌డ్యాం నిర్మించారు. దీంతో ఇక్కడ భారీగా నీరు నిలువ ఉంటోంది. కరువులోనూ పాలేరు నుంచి నీరు పారుతుండడంతో ఇక్కడ నీటి కొరత లేకుండా ఉంటుంది. ఇక్కడ కొద్దిపాటి వ్యయంతో లిఫ్ట్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తగూడెం మేజర్ కాలువకు గోల్‌తండా సమీపంలో కలిపితే అనంతగిరి, కోదాడ మండలాల పరిధిలోని అనంతగిరి, అమీనాబాద్, గోల్‌తండా, వెంకట్రాంపురం, రాఘవాపురం, అజ్మీరతండా, మొగలాయికోట, శాంతినగర్, కోదాడ మండలంలోని తమ్మర, అల్వాలపురం గ్రామాలకు రెండు సీజన్‌ల్లో సాగు, తాగునీరు లభిస్తుందని రైతులు అంటున్నారు. ఈ లిఫ్ట్‌తో కోదాడ పెద్దచెరువును కూడా నింపే అవకాశం ఉంది. పాలేరు డ్యామ్‌ను త్వరలో సీతారామసాగర్ ద్వారా గోదావరి నీటితో నింపబోతున్నారు. దీంతో పాలేరుకు సాగర్‌నీరు రాకపోయినా గోదావరి నీరు ఉంటుందని వారు అంటున్నారు.

మంత్రి దృష్టి సారిస్తే పది గ్రామాలకు మేలు



సాగర్ నీరు అందడంలో ఆలస్యమైనా, చివరి భూములకు నీరందకపోయినా కృష్ణాపురం చెక్ డ్యాం వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేస్తే 10 గ్రామాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది. పాలేరును గోదావరి నీటితో నింపితే ఇక నీటి సమస్యే ఉండదు. కోదాడ పెద్ద చెరువును కూడా నింపవచ్చు. కోదాడ పట్టణంలో మంచినీటి సమస్య కూడా పరిష్కారమవుతుంది. లిఫ్ట్ ఏర్పాటు చేయాలని ఇటీవల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లాం. మంత్రి దృష్టి సారిస్తే 10 గ్రామాల రైతులకు మేలు జరుగుతుంది.

– ఈదుల కృష్ణయ్య, అనంతగిరి మండలం

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. కల్యాణవేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, వంశీక్రిష్ణమాచార్యులు పాల్గొన్నారు.

మనీ సర్క్యులేషన్ యాప్‌లతో నష్టం!

మునగాల : మండలంలోని పలు గ్రామాల్లో పలువురు మనీ సర్క్యులేషన్ యాప్‌లలో చేరి నష్టపోతున్నారు. యాప్‌లలో ఏడాదికి రూ.1800, రూ.4800, రూ.15000లు కడితే 30 రోజుల్లో తమ డబ్బులు తమకు తిరిగి వస్తాయని, మిగతా 11 నెలలు బోనస్‌గా వస్తాయని కొందరు నమ్మబలికి సభ్యులను స్కీమ్‌లలో చేర్చుకుంటున్నారు. గతంలో ఇలాంటివి ఎన్నో స్కీమ్‌లు వచ్చి పలువురు నష్టపోయిన దాఖలాలు కూడా ఉన్నాయి. అయితే మునగాల మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 700 మంది సభ్యులకు పైగా ఈ యాప్‌లో చేరినట్లు సమాచారం. మండల ప్రజలు అత్యాశకు పోయి యాప్‌లో చేరితే నష్టపోయే ప్రమాదముందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మనీ సర్క్యులేషన్ యాప్‌ల పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పోలీసు యంత్రాంగం ఇటువంటి యాప్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

మునగాల : ప్రస్తుత సీజన్‌లో విషజ్వరాలుప్రబలే అవకాశం ఉన్నందున గ్రామపంచాయతీ అధికారులు పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కృష్ణానగర్, బరాఖత్‌గూడెం గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్ సూచించారు. బుధవారం ఆయా గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలలో నిర్వహించిన గ్రామసభలలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో డ్రెయినేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. నీటినిల్వలు, పెంటదిబ్బలు లేకుండా చూడాలని చెప్పారు. గ్రామ పంచాయతీల కార్యదర్శులు నర్రా అనిత, జి.వెంకటేశ్వర్లు, ఉపాధి హామీ ఏపీఓ శైలజ, ఫీల్డ్ అసిస్టెంట్ దొంతిరెడ్డి సులోచన, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

లింగన్నకు నివాళి

కోదాడరూరల్ : ఆదివాసి ప్రజల సమస్యలపై పోరాడుతున్న వారి గుండెల్లో నిలిచిన విప్లవ కిరణం లింగన్న అని అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలోని లాల్‌బంగ్లాలో పార్టీ రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ కార్యదర్శి పూనెం లింగన్న 5వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వక్కవంతుల నరసింహారావు, అలుగుబెల్లి నరసింహారెడ్డి, విజయ్, మైసయ్య, రవితేజ, నరసింహారావు, కొండలు, ఖాసీం, రామారావు, వెంకన్న తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

శ్మశాన వాటిక ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణులు

అనంతగిరి : మండలంలోని కొత్తగూడెంలో విశ్వబ్రాహ్మణుల శ్మశాన వాటిక ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ విశ్వబ్రాహ్మణులు కోరారు. ఈమేరకు బుధవారం అనంతగిరిలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలు కోళ్లూరి నాగేశ్వరమ్మ మాట్లాడుతూ.. కొన్ని వందల ఏళ్లుగా ఉన్న విశ్వబ్రాహ్మణుల శ్మశాన వాటికలోని సమాధుల(సందులు)ను పక్కన పొలం రైతు వాడకొప్పుల రామలింగం జేసీబీతో ధ్వంసం చేసి కనిపించకుండా పూడ్చివేశాడని తెలిపారు. గ్రామంలోని సర్వే నంబర్ 236లో 30 గుంటల భూమిని కొన్ని వందల ఏళ్ల క్రితమే విశ్వబ్రాహ్మణకులానికి కేటాయించారని తెలిపారు. పక్కనే పొలం ఉన్న రైతు శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమిస్తూ ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. తమ శ్మశాన వాటికను ఆక్రమణదారుల నుంచి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వేణు, బ్రహ్మం, రుక్మిణమ్మ, కోళ్లూరి సత్యనారాయణచారి ఉన్నారు.

ఉపాధ్యాయురాలు శకుంతలకు సన్మానం



శకుంతల, నర్సింహారెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నడిగూడెం : విద్యాభివృద్ధికి ఉపాధ్యాయురాలు శకుంతల సేవలు ప్రశంసనీయమని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మస్రం శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల వృత్తి విద్యా విభాగం ఉపాధ్యాయురాలు శకుంతల ఉద్యోగ పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా శకుంతల, పటేల్ నర్సింహారెడ్డి దంపతులను సన్మానించారు. అనంతరం దాత శకుంతల పాఠశాలకు ఆర్‌ఓ వాటర్ ఫిల్టర్, విద్యార్థులకు జామెట్రీ బాక్స్‌లు, బెల్టులు, బ్యాడ్జీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సామినేని శ్రీనివాసరావు, బత్తిని శ్రీనివాసరావు, శోభన్‌బాబు, శ్రీదేవి, మీరాజుద్దీన్, ఎండీ.మౌలానా, అశోక్, కత్తి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, అహల్యదేవి, లలిత, సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు దీర్ఘకాలిక రుణాలు అందజేత



రైతుకు చెక్కు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ

గరిడేపల్లి : సహకార సంఘం అందజేసే రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ అన్నారు. బుధవారం గరిడేపల్లి మండలంలోని రాయినిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో గేదెల పెంపకం కోసం రైతులకు దీర్ఘకాలిక రుణాలు సుమారు రూ.7లక్షల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చనగాని సోంబయ్య, మంగళగిరి కృష్ణ, సెక్రటరీ నిడిగొండ కనకయ్య, సిబ్బంది నకిరేకంటి సాయిలు, పాలేలి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి విడుదల తేదీని అధికారికంగా ప్రకటించాలి

నేరేడుచర్ల : నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల తేదీని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. బుధవారం నేరేడుచర్లలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి దిగువకు భారీగా వరద నీరు వస్తున్నందున సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకొని తేదీని ప్రకటించాలన్నారు. సమావేశంలో పార్టీ మండల, పట్టణ కార్యదర్శులు యల్లబోయిన సింహాద్రి, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జిలకరాజు శ్రీను, దామరచర్ల సైదులు తదితరులు ఉన్నారు.

శ్రీలతారెడ్డి పరామర్శ



ఉదయ్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చల్లా శ్రీలతారెడ్డి, తదితరులు

గరిడేపల్లి : మండలంలోని మర్రికుంట గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు దివంగత రామినేని ప్రభాకర్ కుమారుడు రామినేని ఉదయ్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం మృతుని కుటుంబాన్ని బీజేపీ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లా శ్రీలతారెడ్డి పరామర్శించారు. మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోకల వెంకటేశ్వర్లు, కుక్కడపు వెంకటేశ్వర్లు, సోమయ్య, సత్యనారాయణరెడ్డి, నరేందర్‌రెడ్డి, జగన్నాథం, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సంఘాల ర్యాలీ

నేరేడుచర్ల : మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని కోరుతూ నేరేడుచర్ల పట్టణంలో గురువారం పీడీఎస్‌యూ, పీఓడబ్ల్యూ, పీవైఎల్, ఐఎఫ్‌టీయూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించబోయే ర్యాలీని విజయవంతం చేయాలని ఆ సంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. బుధవారం నేరేడుచర్లలో జరిగిన ప్రజా సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించి, ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సమావేశంలో పీఓడబ్ల్యూ నియోజకవర్గ అధ్యక్షురాలు చెన్నబోయిన లక్ష్మి, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, పీవైఎల్ జిల్లా నాయకులు వాసా కరుణాకర్, పీడీఎస్‌యూ నాయకులు రెడ్డిపల్లి వినయ్ తదితరులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

నడిగూడెం : విద్యాభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెల్లబల్లి స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ జి.పద్మావతి కోరారు. బుధవారం మండలంలోని తెల్లబల్లిలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. మూడవ తరగతి విద్యార్థులపై నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే చేయాలని, నవంబర్‌లో జరిగే ప్రవేశ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. పాఠశాలల్లో రిజిస్టర్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. సమావేశంలో రీసోర్స్ పర్సన్‌లు వెంకటేశ్వర్లు, చంద్రారెడ్డి, శ్రీనివాస్, సురేష్, సీఆర్‌పీ నందిగామ రామారావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ పద్మావతి

దేశాన్ని అప్పుల కుప్పగా మార్చిన బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్ : బీజేపీ పాలకులు దేశాన్ని అప్పుల కుప్పగా మార్చారని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు ఆరోపించారు. బుధవారం హుజూర్‌నగర్‌లో సీపీఐ పట్టణ కౌన్సిల్ నిర్మాణ మహాసభ జక్కుల రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో గతంలో ఉన్న ప్రభుత్వాలు రూ.55 లక్షల కోట్ల అప్పు చేస్తే, పదేళ్ల కాలంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అక్షరాల రూ.135 లక్షల కోట్లు అప్పు చేసిందని తెలిపారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంపై కేంద్రం బడ్జెట్‌లో వివక్ష చూపిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీల్లో 32 అంశాలను పట్టించుకోకపోవడం తెలంగాణ ప్రజలను చిన్నచూపు చూడడమేనని అన్నారు. తెలంగాణ నుంచి ఎన్నికైన బీజేపీ ఎంపీలు నిధుల వివక్షపై కేంద్ర బీజేపీ పెద్దలను నిలదీసి ప్రజల పక్షాన నిలబడాలని కోరారు. దేశంలో, తెలంగాణలో అన్ని వర్గాల ప్రజల సమస్యలు, ఆకాంక్షలపై సీపీఐ నిరంతరం ఉద్యమాలు చేపడుతుందని వారు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి దొంతగాని సత్యనారాయణ, రాష్ట్ర కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, సీపీఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, నాయకులు యల్లావుల రమేష్, జక్కుల శ్రీను, జడ వెంకన్న, సోమగాని కృష్ణ, ఇందిరాల వెంకటేశ్వర్లు, మామిడి వెంకయ్య, యల్లావుల ఉమ, సుందరి పద్మ, చక్రాల స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ప్రయోజనం లేని బడ్జెట్



కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) కేంద్ర కమిటీ పిలుపు మేరకు హుజూర్‌నగర్‌లోని మెయిన్ రోడ్డుపై కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయానికి ప్రస్తుత బడ్జెట్‌లో గత కేటాయింపుల కన్నా తగ్గించారని అన్నారు. ఈ బడ్జెట్‌ను అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర సమితి సభ్యుడు యల్లావుల రాములు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, సీపీఐ నాయకులు గుండు వెంకటేశ్వర్లు, దొంతగాని సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు పోనుబోటి వాసుదేవరావు, జక్కుల రమేష్, మామిడి నరసయ్య, జడ శ్రీనివాస్, యల్లావుల రమేష్, సుందరి పద్మ, ఉమ, జడ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక జన్మదిన వేడుకలు



సామూహిక జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రిటైర్డు ఉద్యోగులు

కోదాడరూరల్ : పెన్షనర్లు సేవా కార్యక్రమాలు చేపడుతూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. బుధవారం కోదాడలోని పెన్షనర్స్ భవన్‌లో జూలై నెలలో జరుపుకునే రిటైర్డు ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో తమకు నిరసనలు, ధర్నాలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వలేదని, ఈ ప్రభుత్వంలోనైనా తమ న్యాయమైన హక్కులను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. ఈ సందర్భంగా జన్మదిన వేడుకలు జరుపుకునే వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోదాడ యూనిట్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, విశ్రాంత డీఈఓ హనుమారెడ్డి, అమృతరెడ్డి, వెంకటేశ్వరరావు, జగన్‌మోహన్, విద్యాసాగర్ ఉన్నారు.

సోషల్ మీడియా పట్ల జాగ్రత్తగా ఉండాలి



విద్యార్థినులను నాప్కిన్స్ అందజేస్తున్న మహిళా సాధికారిత కేంద్రం జిల్లా మిషన్ కోఆర్డినేటర్

మఠంపల్లి : విద్యార్థినులు సోషల్ మీడియా పట్ల జాగ్రత్తగా ఉండాలని మహిళా సాధికారిత కేంద్రం జిల్లా మిషన్ కోఆర్డినేటర్ చైతన్య అన్నారు. బుధవారం మఠంపల్లి మండలంలోని బక్కమంతులగూడెం సమీపంలో గల కస్తూరిబా గాంధీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాట్సాప్, ఇన్‌స్టాగామ్‌లలో వ్యక్తిగత ఫొటోలు పెట్టవద్దని, ఫొటోలు పెడితే సైబర్ నేరగాళ్లు వాటిని మార్ఫింగ్ చేస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలన్నారు. అనంతరం విద్యార్థినులకు ప్లాస్టిక్ రహిత శానిటరీ నాప్కిన్స్, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఓ విజయకుమారి, సాధికారిత కేంద్రం సిబ్బంది రేవతి, వినోద్, తేజస్వినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఉన్నారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి



నారాయణగూడెంలో పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మునగాల : రాజ్యాంగం కల్పించిన హక్కులను పౌరులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వి.ఆంజనేయులు కోరారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం మునగాల మండలంలోని నారాయణగూడెంలో గల ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ప్రజలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి పౌరుడు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నిమ్న జాతుల వారిని కించపరిస్తే చట్టప్రకారం శిక్ష పడుతుందన్నారు. సదస్సులో ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, ఆర్‌ఐ అజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రజిత, పోలీసు సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బూరుగడ్డ ఆలయంలో ఫల పుష్పార్చన



పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి నెల నిర్వహించే బహుళ ఏకాదశి పూజా కార్యక్రమంలో భాగంగా బుధవారం సహస్రనామ ఫల పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, రోహిణి నక్షత్రం, ఫల పుష్పార్చన, బాలభోగం, సేవాకాలం, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, మంగళాశాసనం, ఆరగింపు, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం దాతలు మిర్యాల పురుషోత్తం- శ్రీలత దంపతులు, రాహుల్- మౌనిక దంపతుల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు బనాయించడం సరికాదు

హుజూర్‌నగర్ : విద్యార్థి సంఘాల నాయకులపై అక్రమ కేసులు ఎత్తివేసి విడుదల చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు పి.రాకీ కోరారు. బుధవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన పీడీఎస్‌యూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని హైదరాబాద్‌లో సీఎంకు వినతిపత్రం ఇవ్వడానికి వెళుతున్న పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులను అక్రమంగా అరెస్టు చేసి కేసులు బనాయించడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వివేక్, శివ, ప్రమోద్, వంశి, కార్తీక్, సాయి, ఉదయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించాలి

గరిడేపల్లి : మండలంలోని గారకుంటతండా వద్ద సాగర్ కాలువపై గూనలు కాకుండా బ్రిడ్జి నిర్మిస్తేనే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. రైతు సంఘం నాయకులు మెండె వెంకటేశ్వర్లు, సాంబయ్య, కోటయ్య, శంకర్ పాల్గొన్నారు.